క్లుప్తంగా

నేడు ధ్వజస్తంభం ప్రతిష్ట



ధ్వజస్తంభ ప్రతిష్ట జరగనున్న రామాలయం

ఎటపాక: పురుషోత్తపట్నం గ్రామంలో విగ్రహ ప్రతిష్ట, ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వేదపండితులు శివరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో రుత్విక బృందం మహోత్సవాలను వైభవంగా జరుపనున్నారు. సీతారామచంద్రస్వామి జీవ శిలా ధ్వజస్తంభ బొడ్రాయి ముత్యాలమ్మతల్లి, పోతురాజు, మహాలక్ష్మమ్మ, గట్ట ముసల మ్మతల్లి ఆలయాల్లో జీవ యంత్ర దేవత విగ్రహ పతిష్ట కార్యక్రమాలు ఈనెల 8వరకు జరుపుతున్నారు. అదే విధంగా 7వతేది మూడవ రోజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవం, అన్నదాన కార్యక్రమం, 8న అమ్మవారికి బోనాలు సమర్పణ జరుపనున్నట్టు గ్రామ ఆలయ అభివృద్ధి నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న ఎంపీటీసీ బుజ్జిబాబు

గూడెంకొత్తవీధి: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గాలికొండ ఎంపీటీసీ అంపురంగం బుజ్జిబాబు కోరారు. సప్పర్ల ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఆశా వర్కర్ల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలు పర్యవేక్షించాలని సూచించారు. రక్త పూతలు తీసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఏ.దారకొండ ఉప సర్పంచ్ ముర్ల చంటిబాబు, రామారావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు


తాగునీటి సమస్య లేకుండా చర్యలు



కుళాయిని ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ కునుకూరు పీవీటీజీ వీధికి రక్షిత నీటి సదుపాయం కల్పించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన 12 కుళాయిల నుంచి నీటి సరఫరాను సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్ బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇక్కడ తాగునీటి సమస్యను బేస్ అనే స్వచ్ఛంద సంస్థకు తెలియజేయడంతో వారు స్పందించి అవసరమైన ఏర్పాటు చేశారన్నారు. గతంలో స్థానికులు కిలోమీటరు దూరం నుంచి నీటిని తీసుకువచ్చేవారన్నారు. ఇప్పుడు ఆ సమస్య తప్పిందని చెప్పారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రిలే నిరాహార దీక్షల విరమణ



దీక్షలు విరమింపజేస్తున్న కార్యదర్శి

ఎటపాక: రహదారులకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గుండాల సచివాలయం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 7వ రోజు బుధవారం విరమించారు. దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో దీక్షలు విరమించినట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఐవి తెలిపారు. దీక్షలు చేస్తున్న వారికి పంచాయతీ కార్యదర్శి నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింప జేశారు. నాగేశ్వరరావు, సత్యం, అజయ్, హరి, శ్రీను, స్టాలిన్, సుధాకర్, చలపతి, పద్మ పాల్గొన్నారు. .

ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలి

చింతూరు: ప్రభుత్వం ఉద్యోగ నియామకాల చట్టం ప్రకటించి షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆదివాసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ ఎదుట ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జనరల్ డీఎస్సీ నుంచి షెడ్యూల్ ప్రాంత ఆదివాసీ టీచర్ పోస్టులను మినహాయించి, ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఎన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ప్రకటించాలన్నారు. నాయకులు సాయివెంకటరమణ, నరేష్, స్వరూప, ఇందు, సరిత, మంగాదేవి పాల్గొన్నారు.

పేద ప్రజలకు 'కూటమి' వెన్నుపోటు



అరకులోయలో ప్ల కార్డులతో ఎమ్మెల్యే మత్స్యలింగం, పార్టీ నాయకులు, కార్యకర్తలు

- జిల్లాలో వెన్నుపోటు దినం విజయవంతం
- పాడేరు, అరకులోయ, అడ్డతీగల ప్రాంతాలకు తరలివెళ్లిన పార్టీ శ్రేణులు
- దగా ప్రభుత్వంపై గిరిజనుల తీవ్ర నిరసన

డుంబ్రిగుడ: మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని, గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తూ, నిరంకుశ పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ మేరకు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో, అరకులోయలోని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో, అడ్డతీగలలో రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన



అడ్డతీగలలో మాట్లాడుతున్న అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి

కార్యక్రమానికి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలివచ్చారు. ఆయా ప్రాంతాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. వెన్నుపోటు దినం పేరుతో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున



పార్టీ శ్రేణులు,ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గిరిజనులు పాల్గొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నమ్మి, ఓటేసిన రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని పలువురు ధ్వజమెత్తారు. సంక్షేమం చేతగాని కూటమి ప్రభుత్వ దిగిపోవాలని నినాదాలు చేశారు. డుంబ్రిగుడ మండల కేంద్రం నుంచి అరకులోయ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, లలిత, మండల పార్టీ అధ్యక్షుడు పి.పరశురామ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు గణపతి, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, వెంకటరావు, సుబ్బారావు, నేతలు లీలారాణి, మఠం శంకర్, రామునాయుడు,తరలివెళ్లారు.

గూడెంకొత్తవీధి: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన



వెన్నుపోటు దినం పోస్టర్లతో అరకులోయకు తరలివెళ్లేందుకు సిద్ధమైన డుంబ్రిగుడ మండల నాయకులు

వెన్నుపోటు దినం కార్యక్రమానికి గూడెం కొత్తవీధి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఉదయం నుంచే ఆయా పంచాయతీల నుంచి వాహనాల ద్వారా పాడేరుకు బయలుదేరారు.



అడ్డతీగలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంత బాబు



పాడేరులోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు



గూడెంకొత్తవీధి నుంచి పాడేరుకు బయలుదేరి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు

ఆత్మీయ సన్మానం

కూనవరం: స్థానిక డిజిటల్ అసిస్టెంట్ ధన్నూరి వేణు బదిలీపై వెళ్లడం బాధాకరం అయినప్పటికీ పదోన్నతిపై వెళ్లుతున్నందున స్వాగతించక తప్పదని సర్పంచ్ మల్లంపల్లి హేమంత్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనను సచివాలయ సహచర సిబ్బంది తదితరులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-6, డిజిటల్ అసిస్టెంట్‌గా వేణు అందించిన సేవలు మరువలేనివన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలందించారని కొనియాడారు. డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేసిన వేణు చూచిరేవులగూడెం



కూనవరం సచివాలయంలో డీఏవో వేణును సన్మానిస్తున్న సిబ్బంది

కార్యదర్శి గ్రేడ్-5 పదోన్నతిపై వెళ్లారు. కాగా బుధవారం ఆయన్ని స్థానిక సచివాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి సురేష్, వీఆర్‌వో వెంకన్న, కో-ఆప్షన్ సభ్యులు షరీఫ్, వార్డు సభ్యుడు వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కూనవరం: స్థానిక గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో గత ఏప్రిల్ 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు జరిగిన వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా వివిధ అంశాలపై బుధవారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నట్టు లైబ్రేరియన్ మాదేటి గోవింద రాజులు తెలిపారు. విద్యార్థులకు వ్యాచరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. వి.ఆర్.పురం సబ్‌స్థాఫనాగరాజు, పంచాయతీ కార్యదర్శి సురేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ సాయిలక్ష్మి, విజయసాధన హైస్కూల్ హెచ్‌ఎం రమాదేవి, స్థానికులు సాయిమహేష్, సుబ్బారావు, సత్యనారాయణ, నీలకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఆక్రమణలపై సర్వే

కొయ్యూరు: నిబంధనల ప్రకారం రహదారుల్లో ఆక్రమణలపై సర్వే చేస్తున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. గతంలో ఎస్‌ఎంబీలో నిర్దేశించినట్టుగానే సర్వే చేపట్టామన్నారు. ఆయన బుధవారం రాజేంద్రపాలెంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. గృహాలు, షాపులు కోల్పోతున్నామని, ఇలా అయితే ఎలా బతకాలంటూ అనేక మంది బాధితులు ఆయన ఎదుట మొరపెట్టుకున్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేపట్టి ఆక్రమణలు ఎంత వరకు ఉన్నాయో మార్క్ చేస్తున్నామన్నారు. వారం రోజుల లోపు ఖాళీ చేయాలని నోటీసులు ఇస్తామన్నారు. దీని అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



స్థానికులతో మాట్లాడుతున్న డీటీ స్వామి

అంతా సహకరించాలని ఆయన సూచించారు. చీడిపాలెం పంచాయతీ సింగవరానికి సంబంధించి 45 మందికి నోటీసులు ఇచ్చేందుకు సర్పంచ్, నోటీసులు అందుకోనే వారితో సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సర్పంచ్ పీటా సింహాచలం, ఆర్‌ఐ రాజన్న దొర తదితరులున్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలుచేయాలని వినతి



తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎటపాక: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తానికొండ వాసు ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీల మేరకు తల్లికి వందనం, ఉచిత బస్సు, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రుణాలు, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి తదితర పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రావటానికి ప్రజలను వంచించి ఓట్లు వేయించుకుని ఇప్పుడు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలుచేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి గోసు ప్రశాంత్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పసుపులేటి లక్ష్మణరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గొల్లపల్లి శివబాబు, మండల ఎస్టీ సెల్ నాయకులు వెంకట్, వీరస్వామి, ముత్తయ్య, అర్జున్, చిన్నకాటయ్య, రాజులు, వెంకయ్య పాల్గొన్నారు.

తప్పుడు వ్యాఖ్యలు సహించం



మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: ప్రజలను మోసం చేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క పథకం అమలుచేయకుండా నిరంకుశ పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన అనూహ్య మద్దతుకు జీర్ణించుకోలేని కూటమి నాయకులు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని విమర్శించేందుకు పెదలబడు సర్పంచ్ దాసుబాబుకు కనీస స్థాయి, అర్హత లేదన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక దాసుబాబు మాట్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాన్ని అటకెక్కించిడంతో ప్రజలు తిరుగుబాటు చేస్తున్నా ఎందుకు సమాధానం చెప్పలేక పోతున్నారని ప్రశ్నించారు. దాసుబాబు తన స్థాయిని గుర్తుపెట్టుకోవాలని, ఇకపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాయకులు జగబంధు, తిరుపతి, సన్యాసిరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సెల్ సిగ్నల్ సమస్యకు పరిష్కారం

అందుబాటులోకి వచ్చిన బీఎస్ఎన్ఎల్ సెల్ సేవలు

గూడెంకొత్తవీధి: మండలంలోని ఎర్రవరం, గూడెం కాలనీలో ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్ వ్యవస్థ బీఎస్ఎన్ఎల్ టవర్లు పనిచేస్తున్నాయి. చాలా రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలు అందక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవలకు సమాచారం ఇచ్చేందుకు నానా అవస్థలు పడేవారు. ఈ సమస్యను 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు 'అలంకారప్రాయంగా బీఎస్ఎన్ఎల్ సేవలు' శీర్షికతో ఈనెల 2న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఈ మేరకు టవర్లలో నెలకొన్న సాంకేతిక సమస్యను పరిష్కరించారు. ఈ కారణంగా టవర్లు రెండు పని చేస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్ టవర్ల నుంచి సెల్ సిగ్నల్స్ అందబాటులోకి వచ్చింది. దీంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేవారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కరానికి కృషి చేసిన

సాక్షి ఎఫెక్ట్..




బీఎస్ఎన్ఎల్ టవర్

'సాక్షి'కి, బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు కృతజ్ఞతలు తెలిపారు. స్పందించిన అధికారులకు హర్షం వ్యక్తం చేశారు. నిరంతరం సేవలందేలా అధికారులు చూడాలని కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రంపచోడవరం: మండల కేంద్రంలో బుధవారం రైతులకు మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా వరాహ క్లైమైట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజర్ ఎం.ఎస్.ఎన్.మూర్తి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం తమ సంస్థ తరపున కృషి చేస్తున్నామన్నారు.

ఇందులో భాగంగా విస్తృతంగా మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇప్పటివరకు ఏజెన్సీలో ఒక లక్ష 20వేలకు మొక్కలను పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది సంస్థ తరపున ఏజెన్సీలో గిరిజన రైతులకు నాలుగు లక్షల 50వేల మొక్కలను ఉచితంగా అందించేందుకు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఖాళీ భూమిలో ఈ మొక్కలు నాటడం ద్వారా ఫలసాయాన్ని పొందడమే కాకుండా భవిష్యత్ ఖచ్చితంగా అదనపు ఆదాయం వస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో బుధవారం పర్యటించి అనేక మంది రైతులతో మాట్లాడడం జరిగిందన్నారు. ఏరియా కో-ఆర్డినేటర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ మేనేజర్ మూర్తి

కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

చింతూరు: మండలంలోని చిడుమూరు వద్ద బుధవారం కోడిపందాల స్థావరంపై చింతూరు పోలీసులు దాడిచేసి మూడు కోడిపుంజులు, మూడు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తొమ్మిది మందిపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ రమేష్ చెప్పారు. కోడిపందాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, మండలంలో ఎక్కడ పందాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమేష్ హెచ్చరించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

మండలకేంద్రతో పాటు ఎర్రంపేటలో ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. గంజాయి రవాణాను నిరోధించేందుకు పలు జంక్షన్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. వాహనచోదకులకు సరైన ధ్రువపత్రాలు లేకున్నా, లైసెన్సు లేకుండా మైనర్లు వాహనాలు నడిపినా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ద్విచక్రవాహనచోదకుల తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొదని ఆటో డ్రైవర్లకు సూచించారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆక్రమిత స్థలాలను ఖాళీ చేయాలని నోటీసులు

చింతపల్లి: మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ స్థలాలను ఆక్రమించుకుని వ్యాపార దుకాణాలు నిర్వహిస్తున్నటువంటి వారిని వెంటనే ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి డిగ్రీ కాలేజి వరకూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని దుకాణాలు నిర్వహిస్తున్నటువంటి 160 మందిని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆక్రమణలను తొలగించాలని ఇటీవల హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఆయా ఆదేశాల అనుగుణంగా గత వారం క్రితం 10 మందికి నోటీసులను అధికారులు జారీ చేశారు. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టారు.స్థానికంగా ప్రజాప్రతినిదులు, వ్యాపారులు కలిసి వారం రోజులు గడువు ఇవ్వాలని, తామే స్వచ్ఛందంగా దుకాణాలు తొలగించుకుంటామని రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. కొంతమంది వర్తకులు ఇప్పటికే స్వచ్ఛందంగా తమ దుకాణాలను తొలగించారు. తాజాగా మరో 38 మందికి ఆక్రమిత స్థలాలను ఖాళీ చేయాలని నోటీసులు అందజేశారు. మూడు రోజుల్లో స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని లేకుంటే రెవెన్యూ అధికారులే దుకాణాలను తొలగిస్తారని నోటీసులో పేర్కొన్నారు.



నోటీసులు అందజేస్తున్న వీఆర్‌ఓలు

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం



సూచనలిస్తున్న ఎంఈవో ఈశ్వరరావు

హుకుంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించాలని ఎంఈవో కోడా ఈశ్వరరావు చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పాఠశాలలో పనిచేస్తున్న కుక్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. మెనూ ప్రకారం రోజు రుచికరమైన ఆహారాన్ని అందజేయాలన్నారు. సిబ్బంది జాన్, రాంబాబు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

7న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఈనెల 7న నిర్వహించనున్నట్టు మండల ఆప్తామాలిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్ తెలిపారు.

వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి(విజయనగరం), జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక వైద్యనిపుణులతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చే వారంతా ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలన్నారు.

కంటి ఆపరేషన్ అవసరమైన వారికి విజయనగరంలోని వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించనున్నట్టు పేర్కొన్నారు. వారికి ఉచితంగా రవాణా, వసతి, భోజనం కల్పిస్తున్నట్టు కిషోర్‌కుమార్ తెలిపారు.

పథకాలపై అవగాహన

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన పార్టీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రరావు, సన్యాసిరావు, దేముడు, శరభయ్య, అర్జున్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతర నేడు

దేవరాపల్లి : నాగయ్యపేట గ్రామస్తుల ఆరాధ్య దైవం గండిమారమ్మ పండగను గురువారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 25 సంవత్సరాల తర్వాత పండుగ నిర్వహిస్తుండడంతో గ్రామంలోని ఇళ్లన్నీ బంధుమిత్రులతో కళకళలాడుతున్నాయి. ఉదయం నుంచి అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.